క్లుప్తంగా

గంగమ్మతల్లికి పూజలు


విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లికి ఆదివారం ఆలయంలో పట్టు వస్త్రాలు, నగలు, గంధం, పసుపు ప్రత్యేక పూల మాలలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను అమ్మవారికి చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్రస్వామి, వైద్య నాథీశ్వర ఆలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా ఆలయాలలో భక్తులు పూజలు చేశారు.

నివాళి


నివాళులు అర్పిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, పీ రవీంద్రనాథరెడ్డి, అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

వల్లూరు : మండలంలోని కుమారునిపల్లె సర్పంచ్, కొప్పోలు మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పుత్తా శ్రీనివాసులురెడ్డి శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం ఆయన పార్థివ దేహాన్ని పుత్త చిన్నాయపల్లె సమీపం కొత్తకొట్టాలు గ్రామంలోని ఆయన స్వగృహానికి తరలించారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పీ రవీంద్రనాథరెడ్డి, మాజీ ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మాజీ రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల సలహాదారులు రాజోలు వీరారెడ్డి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ వ్యవసాయ సలహాదారులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, పార్టీ నేతలు నివాళులు అర్పించారు.

దోమకాటుకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి

వేంపల్లె : దోమకాటుకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య తెలిపారు. ఆదివారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఎక్కడ చూసిన నీరు నిల్వ ఉన్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీంతో దోమల లార్వా విస్తరించి మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్య విభాగం ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహిస్తోందన్నారు. ప్రతి శుక్రవారం ఆరోగ్య సిబ్బంది ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు.

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు

పులివెందుల రూరల్ : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, ఎంపీడీఓ కృష్ణమూర్తిలు అన్నారు. పట్టణంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కొన్నేళ్లుగా సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జనార్థన్‌బాబు పదవీ విరమణ కావడంతో ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కాలంగా పనిచేస్తూ పదవీ విరమణ కావడం బాధాకరమైనప్పటికీ పదవీ విరమణ ప్రభుత్వ ఉద్యోగికి తప్పదన్నారు. అనంతరం మాజీ ఎంపీడీఓ ముకుందారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.

సమాజసేవ చేయాలి


జమ్మలమడుగు : ప్రతి ఒక్కరు తాము చేస్తున్న ఉద్యోగంతోపాటు సమాజ సేవ చేయాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో ఉన్న గడియారం వెంకట శేషశాస్త్రి సభాభవనంలో రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా మారెడ్డి వెంకటకృష్ణారెడ్డి, సెక్రటరీగా సంజీవరాయుడు, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్‌రఫిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ క్లబ్ తరపున సమాజంలో ఉన్న నిరుపేదలను ఆదుకోవాలన్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు.

నిమజ్జనంలో ఘర్షణ

వేముల : మండలంలోని వి.కొత్తపల్లెలో ఆదివారం వినాయక నిమజ్జన వేడుకలలో స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామంలోని ఓ వ్యక్తి, వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో వినాయక నిమజ్జనాన్ని ఎలా చేస్తారంటూ గ్రామంలోని మహిళలు అడ్డుకోబోయారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

అంబకపల్లె చెరువుకు కృష్ణా జలాలు

- పాడా నిధులతో చెరువు నిర్మాణం
- ఎంపీ నిధులతో ఎత్తిపోతల పథకం, పైపులైన్ ఏర్పాటు
- సమృద్ధిగా లభిస్తున్న తాగు, సాగునీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న అంబకపల్లె గ్రామస్తులు, రైతులు


అంబకపల్లె గంగమ్మ కుంట చెరువుకు చేరిన కృష్ణా జలాలు


అంబకపల్లె, నల్లపురెడ్డిపల్లె గ్రామాల చెరువులకు కృష్ణా జలాలను తరలించే భారీ విద్యుత్ మోటార్లు

లింగాల : దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పులివెందుల నియోజకవర్గాన్ని, లింగాల మండలాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఎనలేని కృషి చేశారు. ఆయన కృషి ఫలితంగా లింగాల కుడి కాలువ పథకాలతోపాటు మండలంలోని అన్ని గ్రామాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా మండలంలోని అన్ని చెరువులు, కుంటలకు కృష్ణ జలాలను విడుదల చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ రైతులను విస్మరించింది. తీవ్ర కరువు కాటకాలతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నా కుడి కాలువకు చుక్క నీరు విడుదల చేయలేదు. నీరు విడుదల చేయాలంటూ ఆ పార్టీ నాయకులే దీక్షలు, ధర్నాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి లింగాల కుడి కాలువకు పుష్కలంగా నీరు అంది ఎత్తిపోతల పథకాల ద్వారా మండలంలోని అన్ని గ్రామాల చెరువులకు, కుంటలకు నీరు విడుదల చేసి మండలాన్ని సస్యశ్యామలం చేశారు. అయితే ఒక అంబకపల్లె, పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామాల్లోని చెరువులకు నీరు అందించడం ఆలస్యమైంది. అయినప్పటికీ పాడా నిధుల ద్వారా అంబకపల్లె గంగమ్మ కుంటకు 14 ఎకరాల భూసేకరణ కోసం రూ.1.40 కోట్లు వెచ్చించి, మరో కోటి రూపాయలతో కొత్త చెరువును నిర్మించారు. అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆయన ఎంపీ నిధులతో రూ.2.50 కోట్లు వెచ్చించి హిరోజ్‌పురం గ్రామం వద్ద భారీ సంప్‌ను ఏర్పాటు చేసి 4.50 కి.మీ మేర అంబకపల్లె చెరువుకు పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని విడుదల చేయించారు. అదేవిధంగా నల్లపురెడ్డిపల్లె చెరువుకు పైపులైన్‌ను ఏర్పాటు చేయించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల కృషి ఫలితంగా ఆయా గ్రామాల్లో భూగర్భజలాలు పెంపొంది తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా చేశారు.

సమృద్ధిగా లభిస్తున్న సాగు, తాగునీరు :
అంబకపల్లెలో గుక్కెడు తాగునీటి కోసం గ్రామస్తులు వ్యవసాయ పొలాల వెంట పరుగులు తీయాల్సిన పరిస్థితి ఉండేది. 1000 అడుగుల లోతు బోరు బావులు తవ్వినా చుక్కనీరు లభించేది కాదు. ఆ గ్రామంలో ప్రధానంగా అరటి, మిరప, టమోట పంటలను సాగు చేసేవారు. నిలువునా పంటలు ఎండిపోయి దిక్కుతోచని పరిస్థితులలో రైతులు ఉండేవారు. ప్రస్తుతం గంగమ్మ కుంట చెరువుకు నీరు విడుదల చేయడంతో అమాంతం బోరుబావుల్లో భూగర్భజలాలు పెరిగి రైతులు నిచ్చింతంగా పంటలు సాగు చేస్తున్నారు. అలాగే తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోయింది.

అంబకపల్లె చెరువుకు నీరు తరలింపు ఇలా :
లింగాల మండలం అంబకపల్లె గంగమ్మ కుంట చెరువుకు నీటి తరలింపు వ్యయ ప్రయాసాలతో కూడినది. చుట్టూ ఎత్తైన కొండలతో లోయలో ఉన్న గ్రామానికి ఎంతో వ్యయ ప్రయాసాలతో కృష్ణా జలాలను గ్రామానికి తరలించారు. లింగాల కుడికాలువ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పట్ల చెరువుకు, ఇప్పట్ల చెరువు నుంచి హిరోజ్‌పురంకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని తరలించారు. హిరోజ్‌పురం వద్ద భారీ సంప్‌ను ఏర్పాటు చేసి అక్కడ భారీ విద్యుత్ మోటార్లను అమర్చి ఇటు అంబకపల్లెకు, అటు నల్లపురెడ్డిపల్లె గ్రామంలోని ఎర్రబల్లె చెరువుకు కృష్ణా జలాలను తరలిస్తున్నారు. 4.50 కి.మీ మేర భారీ పైపులైన్ ఏర్పాటు చేసి హిరోజ్‌పురం ఎత్తిపోతల పథకం భారీ మోటార్ల నుంచి నీటిని అందించడం జరుగుతోంది.


అంబకపల్లె గంగమ్మ కుంట చెరువుకు పైపులైన్ ద్వారా చేరుకుంటున్న కృష్ణా జలాలు


హిరోజ్‌పురం వద్ద ఏర్పాటు చేసిన భారీ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన సంప్

ఎడారి ప్రాంతం నుంచి సస్యశ్యామలంగా మారింది



అంబకపల్లె గ్రామం ఒకప్పుడు ఎడారి ప్రాంతంగా ఉండేది. అనునిత్యం గ్రామంలో కక్షలు, కార్పణ్యాలతో విలవిలలాడుతుండేది. ఒక పక్క కరువు కాటకాలు, మరోపక్క ఫ్యాక్షన్ కారణంగా గ్రామ ప్రజల జీవనం అగమ్యగోచరంగా ఉండేది. రాయలసీమ ప్రాంతం అంటే ఫ్యాక్షన్ కు పేరుగాంచింది. ప్రస్తుతం ఉద్యాన పంటలను సాగు చేస్తూ రాయలసీమలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. గ్రామంలో అరటి పంటలు విస్తారంగా సాగు చేసి విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నాం. సాగునీరు లేక గత పదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ప్రస్తుతం మాజీ సీఎం వైఎస్ జగన్, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల కృషి ఫలితంగా ఎడారి ప్రాంతం ఉన్న అంబకపల్లె గ్రామాన్ని సస్యశ్యామలంగా చేశారు.

– బండి శ్రీనివాసరెడ్డి, రైతు, అంబకపల్లె, గ్రామం, లింగాల మండలం

రైతులకు భూగర్భజలాలు పుష్కలంగా అందుతున్నాయి



పంటలు సాగు చేసి భూగర్భజలాలు అందక ప్రతి ఏటా రైతులు కోట్లాది రూపాయలు బోరుబావుల కోసం వెచ్చించారు. అయినా భూగర్భజలాలు లభించేవి కావు. ప్రస్తుతం గంగమ్మ కుంట చెరువుకు నీరు విడుదల చేసిన తర్వాత భూగర్భజలాలు 200 అడుగులలోపు చేరుకున్నాయి. ఇక నిచ్చింతంగా వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాం.

– వేణుగోపాల్‌రెడ్డి, రైతు, అంబకపల్లె గ్రామం, లింగాల మండలం

తాగునీటి సమస్యకు పరిష్కారం


పాలిటెక్నిక్ కళాశాల వద్ద బోరు వేయిస్తున్న జెడ్పీటీసీ, తదితరులు

వేంపల్లె : పట్టణ శివారులోని పాలిటెక్నిక్ కళాశాలలో నీటి కొరతపై స్థానిక జెడ్పీటీసీ మాచిరెడ్డి రవికుమార్‌రెడ్డి చొరవ చూపి తాగునీటికి పరిష్కారం చేశారు. అక్కడ చదువుతున్న విద్యార్థులకు నీటి కొరత ఉందని కళాశాల సిబ్బంది జెడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన మండల గ్రాంటు కింద బోరును వేయించి, సమస్య పరిష్కారానికి కృషి చేశారు. కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి జెడ్పీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు.

4న మహమ్మద్ ప్రవక్త జ్ఞాపికల ప్రదర్శన


శిష్యులనుద్దేశించి మాట్లాడుతున్న సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ

జమ్మలమడుగు : మిలాడిన్నబీ పురస్కరించుకుని ఈనెల 4వ తేదీన మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన తలనీలాలమొదలు కొని కాళ్లకుతొడుక్కునే పాదుకాల వరకు వివిధ రకాలవస్తువుల ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని ఆస్థానయే గౌసియా అధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ, తనయుడు తాహీర్‌పీరా ఖాద్రీలు తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఆస్తానయే గౌసియాలో భక్తులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మించి 1500 సంవత్సరాలైనందున ఈ ఏడాది గౌసియా ఆస్థానంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మహమ్మద్ ప్రవక్త యొక్క దాదాపు 20 రకాలకు పైగా వస్తువుల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందు రోజు గంధం నిర్వహిస్తారన్నారు. శుక్రవారం ఉదయం మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏటీఎస్ మహమ్మద్ గౌస్, ఎంఎం బాషా, జహంగీర్, యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక లడ్డూ వేలం పాటలలో..


పులివెందులలో రూ.3.60 లక్షలకు దక్కించుకున్న మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు


పులివెందులలో వినాయక లడ్డూను దక్కించుకున్న భారత్‌రెడ్డి


జమ్మలమడుగులో రూ.2.10 లక్షలకు దక్కించుకున్న గంగాప్రసాద్


పెద్దకూడాలలో లడ్డూతో పెద్దమల్లు చిన్నారెడ్డి కుటుంబ సభ్యులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని గరండాల్ బ్రిడ్జి సమీపంలోని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు గిరి హోటల్ యజమాని ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆదివారం వినాయకుని లడ్డు వేలం పాట నిర్వహించారు. ఎంఆర్ క్రియేటివ్ ఆగ్రో ఫాం యజమానులు మల్లారెడ్డి, మోహన్‌రెడ్డిలు రూ.3.60లక్షలకు దక్కించుకున్నారు. కాగా స్వామివారి గజమాలను వేలం పాట నిర్వహించగా భక్తుడు సుబ్బయ్య రూ.1.71లక్షకు దక్కించుకున్నారు. వీరిని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి బ్యాండ్ వాయిద్యాలతో వినాయకుని లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక శ్రీకర్ ఫంక్షన్ హాలు వద్ద వేలం పాటలో లడ్డూను భరత్ రెడ్డి రూ.1.21 లక్షలకు దక్కించుకున్నాడు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక పుల్లయ్యతోటలో ఆదివారం 16 కేజీల లడ్డును వేలం పాటలో రూ.1.20 లక్షలకు శ్రీనివాసులరెడ్డి సొంతం చేసుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కలశాన్ని మురళీనాథ్ రెడ్డి రూ.23వేలు పాడి దక్కించుకున్నారు. అలాగే స్థానిక గండి రోడ్డులోని శ్రీరాంనగర్ ట్యాంక్ బజార్ యూత్ ఆధ్వర్యంలో డేరంగుల విశ్వనాథ్ రూ.93 వేలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. కలశాన్ని పందిబోటి వెంకటేష్ రూ.40 వేలకు దక్కించుకున్నారు. విగ్రహం బొడ్డులోని రూపాయిని బత్తెన శివ రూ.12,500లకు దక్కించుకున్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : నర్సోజి కొట్టాల గ్రామంలో వినాయకుడి లడ్డును రూ.2.10 లక్షలకు పోతనబోయిన గంగా ప్రసాద్ దక్కించుకోగా, స్వామి వద్ద ఉంచిన వెండి బిళ్లను నక్కా నాగేంద్ర రూ.43వేలకు, లక్ష్మీదండను రూ.60 వేలకు బాలవర్ధిలు దక్కించుకున్నారు. అనంతరం స్వామి వారిని పెన్నానదిలో నిమజ్జనం చేశారు.

ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు


పులివెందులలో వినాయక నిమజ్జనానికి తరలివెళుతున్న మహిళలు


ముద్దనూరులో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

పులివెందుల టౌన్ : పట్టణంలో 5వ రోజు ఆదివారం వినాయక నిమజ్జన వేడుకలు కొనసాగాయి. పట్టణంలోని గుంతబజార్, మెయిన్ బజార్, బలిజ సంఘం వీధి, భాకరాపురం, ఎర్రగుడిపల్లె, మారుతి హాలు రోడ్డు, పార్నపల్లె రోడ్డు పట్టణంలోని అన్ని ప్రాంతాలతోపాటు బ్రాహ్మణపల్లె వినాయకుని మండపాలలో వినాయకున్ని ప్రత్యేక వాహనంలో ఉంచి కన్నుల పండుగలా వినాయకుని గ్రామోత్సవం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని రంగులు చల్లుకున్నారు. మండల పరిధిలోని కొత్తపల్లెలో వినాయకుడిని డప్పు వాయిద్యాల మధ్య నిమజ్జనానికి తరలించారు.


చిన్నచెప్పలిలో జరుగుతున్న ఊరేగింపులో పాల్గొన్న గ్రామ యువత


కొత్తసంగటిపల్లెలో గణనాథుని నిమజ్జనానికి తీసుకెలుతున్న భక్తులు


పులివెందులలో వినాయకుని నిమజ్జనంలో చిందులేస్తున్న యువకులు

కమలాపురంలో..

కమలాపురం : మండలంలోని గంగవరం, విభరాపురం, అప్పాయపల్లె, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, చదిపిరాళ్ల, పందిళ్లపల్లె తదితర గ్రామాలలో నిమజ్జనం చేశారు. సీఐ ఎస్‌కే రోషన్ కందూ నది వద్ద జాగ్రత్తలు తీసుకున్నారు. చిన్నచెప్పలిలో నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని కొండూరు, చెర్లోపల్లె, కొత్తసంగటిపల్లె, మర్రిమాకులపల్లె తదితర గ్రామాలల్లో ఆదివారం ఘనంగా గణనాథుని నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. డప్పులు, బాణసంచా కాల్చుతు నిమజ్జనానికి తీసుకెళ్లారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండపాల్లో కొలువుదీరిన విగ్రహాలు భక్తుల కోలాహలం మధ్య నిమజ్జనానికి తరలించారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని అన్ని గ్రామాలతోపాటు కార్పొరేషన్ పరిధిలోని వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : స్థానిక బస్టాండు సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఆదివారం కోలాహలంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళల కోలాట ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది.

లింగాలలో..

లింగాల : మండలంలోని వెలిదండ్ల, పెద్దకుడాల గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దకుడాల గ్రామంలో లడ్డూను ఎంపీటీసీ పెద్దమల్లు గోవిందమ్మ భర్త పెద్దమల్లు చిన్నారెడ్డి రూ.95వేలకు దక్కించుకున్నారు.


చింతకొమ్మదిన్నెలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


సింహాద్రిపురంలో కోలాట ప్రదర్శనలో మహిళలు


చిన్నచెప్పలిలో జరుగుతున్న ఊరేగింపులో వినాయకుడు

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండలంలోని నడివురులో, మాలెపాడు, పోట్లదుర్తి, కదిరివారిపల్లె గ్రామాల పరిధిలో వినాయకుడి నిమజ్జనం వేడుకలు వైభవంగా జరిగాయి. పోట్లదుర్తిలోని పెన్నానదిలో నిమజ్జనం ఏర్పాట్లును సీఐ విశ్వనాథ్‌రెడ్డి, ఎస్ఐ నాగమురళిలు తమ సిబ్బందిత పర్యవేక్షణ చేశారు.


కదిరివారిపల్లెలో వినాయకుడి నిమజ్జనానికి తరలిస్తున్న యువత


పులివెందులలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని పలు గ్రామాల్లో గణేషుని నిమజ్జనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వెంకటాపురం వీవర్స్ కాలనీ, కొప్పోలు, పాపాఘ్ని నగర్ తదితర గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. లడ్డూ, చెరుకు గడ ప్రసాదాల వేలం పాట నిర్వహించారు. వల్లూరులోని జడ్పీ హైస్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన గణేషుని విగ్రహం వద్ద జరిగిన వేలం పాటలో స్వామివారి లడ్డు రూ 50 వేలు పలికింది. కొప్పోలులో జరిగిన వేలం పాటలో లడ్డు రూ 25 వేలు పలికింది. ఎస్‌ఐ పెద్ద ఓబన్న అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట, గోటూరు వంక, ఆలంఖాన్‌పల్లె సమీపంలోని కేసీ కెనాల్‌లో నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు.


వల్లూరులో గ్రామోత్సవంలో గణనాథులు